క్లుప్తంగా

బంగారు బాల్యం సర్వే పరిశీలన

సంతనూతలపాడు: మండలంలోని మంగమూరు, సంతనూతలపాడు ఒకటో సచివాలయం పరిధిలోని పలు కాలనీల్లో బుధవారం బంగారు బాల్యం సర్వేని ఎంపీడీవో డి.సురేష్ బాబు పరిశీలించారు. సర్వే చేస్తున్న సిబ్బందికి సలహాలు, సూచనలు చేశారు.

రేషనలైజేషన్ నిలుపుదల చేయాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సర్వేయర్లు

నాగులుప్పలపాడు: మండల సచివాలయ సర్వేయర్లకు సంబంధించి రేషనలైజేషన్ నిలుపుదల చేయాలని కోరుతూ రాష్ట్రవ్యాప్తంగా చేస్తున్న నిరసనలో భాగంగా బుధవారం స్థానిక తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. విజయవాడలో జరుగుతున్న రిలే నిరాహారదీక్షలో పాల్గొనేందుకు సెలవు ఇవ్వాలని కోరారు. అదేవిధంగా ప్రమోషన్లు సీనియార్టీ ప్రకారం ఇవ్వాలని, పెండింగ్లో ఉన్న టీఏ, డీఏ బిల్లులు ఇవ్వాలని కోరారు. నోషనల్ ఇంక్రిమెంట్లు వెంటనే మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో మండలంలోని అన్ని గ్రామాల సచివాలయ సర్వేయర్లు పాల్గొన్నారు.

250 మందికి వైద్య పరీక్షలు



రోగులకు పరీక్షలు చేస్తున్న వైద్యులు

నాగులుప్పలపాడు: మండలంలోని కె.తక్కెళ్లపాడులో సర్పంచ్ రామ్మోహన్‌రావు సహకారంతో ఒంగోలు కిమ్స్ హాస్పిటల్ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్లు రామాంజనేయులు, స్వాతివరప్రసాదు పాల్గొని 250 మందికి వైద్య పరీక్షలు చేశారు. వారిలో 70 మందికి ఆరోగ్యశ్రీ, ఈహెచ్ఎస్ ద్వారా ఉచితంగా వైద్యసేవలు అందిస్తామని మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ షేక్ రఫీ తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ సురేఖ, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎమర్జెన్సీకి యాభై సంవత్సరాలు



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

ఒంగోలు సిటీ: ఎమర్జెన్సీ విధించి బుధవారం నాటికి 50 సంవత్సరాలు పూర్తయినట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు సెగ్గెం శ్రీనివాసరావు అన్నారు. ఈ సందర్భంగా బీజేపీ ఆధ్వర్యంలో స్థానిక ఏకేవీకే కళాశాలలో సెమినార్ నిర్వహించారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ 1975లో ప్రజల స్వేచ్ఛను హరిస్తూ ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ ప్రకటించి ప్రజాస్వామ్యాన్ని హత్య చేసినట్లు తెలిపారు. అది ఒక చీకటి రోజుగా అభివర్ణించారు. పత్రికలకు, కోర్టులకు కూడా స్వేచ్ఛ లేకుండా చేసినట్లు చెప్పారు. ఆర్ఎస్ఎస్, దాని అనుబంధ సంస్థలను నిషేధించిందన్నారు. కార్యక్రమంలో శ్రీరామ శర్మ, బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు శివారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కూకట్ల నాగేశ్వరరావు, శివాజీ యాదవ్, కావూరి వాసు, టి.అశోక్‌రెడ్డి, బొడ్డులూరి ఆంజనేయులు, జె.రమాదేవి, జి.సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

గిద్దలూరు రూరల్: గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో బైక్‌పై వెళ్తున్న వ్యక్తికి తీవ్రగాయాలైన సంఘటన స్థానిక నంద్యాల రోడ్డులోని జగనన్న కాలనీ సమీపంలో బుధవారం చోటుచేసుకుంది. అందిన వివరాల ప్రకారం.. మండలంలోని ఎస్.బయనపల్లె గ్రామానికి చెందిన స్వామిరంగయ్య బైక్‌పై వెళ్తుండగా వెనుక నుంచి గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో స్వామిరంగయ్య తలకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల నుంచి సమాచారం అందుకున్న 108 సిబ్బంది క్షతగాత్రుడిని గిద్దలూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.



గాయపడిన స్వామిరంగయ్య

మార్గదర్శకులను త్వరగా గుర్తించాలి

- పేదలకు సాయం చేసేందుకే పీ–4 పథకం
- సమీక్ష సమావేశంలో కలెక్టర్ తమీమ్ అన్సారియా



పీ-4 పథకం సమీక్షలో అధికారులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు సబర్బన్: ప్రభుత్వ, ప్రైవేటు ప్రజల భాగస్వామ్యం (పి–4) పథకం కోసం మార్గదర్శకులను త్వరగా గుర్తించాలని కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా చెప్పారు. పీ–4 పథకంలో భాగంగా పేదలకు సహాయం చేసేందుకు అవసరమైన చర్యలపై బుధవారం ప్రకాశం భవనంలో సంబంధిత అధికారులతో ఆమె ప్రత్యేక సమావేశం నిర్వహించారు. బంగారు కుటుంబాల కింద జిల్లాలో 74 వేలకు పైగా ఉన్నట్లు ప్రాథమికంగా అంచనాకు వచ్చినట్లు కలెక్టర్ చెప్పారు.

వివిధ ప్రభుత్వ పథకాలతో పాటు వీటికి అవసరమైన సహాయం చేసేలా మార్గదర్శకులను గుర్తించేందుకు ఆగస్టు 15వ తేదీ తుది గడువు అని, త్వరగా గుర్తించాలని స్పష్టం చేశారు. అదే సమయంలో బంగారు కుటుంబాలుగా పేర్కొన్న వాటిలో పొందగోరే సహాయాన్ని నిర్దిష్టంగా గుర్తించాలని ఆమె చెప్పారు. ఆ మేరకు మార్గదర్శకులను వాటితో అనుసంధానం చేయాలని కలెక్టర్ దిశా నిర్దేశం చేశారు.

జిల్లా స్థాయితో పాటు మండల స్థాయి అధికారులను కూడా మార్గదర్శకులుగా కొన్ని కుటుంబాలకు అనుసంధానం చేసి ఆయా కుటుంబాలు పేదరికం నుంచి బయటపడేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించేలా చూడాలని కలెక్టర్ తెలిపారు. సమావేశంలో జెడ్పీ సీఈవో చిరంజీవి, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి బొల్లిపల్లి రవికుమార్, బీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ముప్పూరి వెంకటేశ్వరరావు, జిల్లా గనుల శాఖ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్, బంగారు బాల్యం కార్యక్రమం జిల్లా నోడల్ అధికారి గిరిధర్ శర్మ, ఇంచార్జ్ సీపీఓ స్వరూపారాణి తదితరులు పాల్గొన్నారు.

ఇంటి వద్దకే రేషన్ ఇవ్వాలి

- 26 నుంచి 30వ తేదీలోపు వృద్ధులు, వికలాంగులకు అందించాలి
- తహసీల్దార్ నారాయణరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ నారాయణరెడ్డి

సంతనూతలపాడు:

రేషన్ డీలర్లు తప్పనిసరిగా ప్రతినెలా 26 నుంచి 30వ తేదీలోపు 65 సంవత్సరాలు పైబడిన వృద్ధులు, వికలాంగులకు వారి ఇళ్ల వద్దకే రేషన్ ఇవ్వాలని, లేకుంటే చర్యలు తీసుకుంటామని సంతనూతలపాడు తహసీల్దార్ ఎస్ఎల్ నారాయణరెడ్డి స్పష్టం చేశారు. స్థానిక మండల రెవెన్యూ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన రేషన్ డీలర్ల సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీలర్లను హెచ్చరించారు. ప్రతి నెలా ఒకటో తేదీ నుంచి 15వ తేదీ వరకు ప్రభుత్వం నిర్దేశించిన వేళల్లో రేషన్ షాపులు తెరవాలన్నారు. ప్రస్తుతం మండలంలో 72 శాతం పంపిణీ మాత్రమే జరుగుతోందని, 85 శాతం మేరకు పంపిణీ జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్డుదారులకు రేషన్ పంపిణీ విషయంలో అవకతవకలు జరిగితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ ఆర్‌వీఎస్ కృష్ణమోహన్, మండల డిప్యూటీ తహసీల్దార్ ఎస్‌కే రఫీ, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ గుణవంశీ, మండలంలోని రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

వైఎస్ జగన్‌ను కలిసిన చుండూరి రవిబాబు



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో చుండూరి రవిబాబు



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో పాటిమీదపాలెం రైతులు

ఒంగోలు సిటీ: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని బుధవారం తాడేపల్లిలోని వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయంలో ఆ పార్టీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరి రవిబాబు మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలో జరుగుతున్న రాజకీయ పరిణామాలపై చర్చించారు. పార్టీ బలోపేతానికి చుండూరి రవిబాబు చేస్తున్న కృషిని వైఎస్ జగన్ అభినందించారు. నిరంతరం ప్రజల కోసం పనిచేస్తూ పార్టీని ముందుకు నడిపించాలని కోరారు.

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన రైతులు...

చీమకుర్తి: మండలంలోని పాటిమీదపాలెం గ్రామానికి చెందిన రైతులు కుమ్మిత ఇంద్రసేనారెడ్డి, సుబ్బారెడ్డి బుధవారం తాడేపల్లిలో మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. పొగాకు, మిర్చి, పత్తి రైతులు పడుతున్న ఇబ్బందులను జగన్ దృష్టికి తీసుకెళ్లినట్లు వారు తెలిపారు.

ప్రకృతి వ్యవసాయం పరిశీలన



ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగుచేస్తున్న పంటను పరిశీలిస్తున్న అధికారులు

కొత్తపట్నం: ఐటీసీ–బంగారు భవిష్యత్తు వారి సహకారంతో గ్రామసిరి ఆధ్వర్యంలో జిల్లాలోని వివిధ మండలాల్లో ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగుచేస్తున్న పంటలను బుధవారం అధికారులు పరిశీలించారు. ముందుగా రంగాయపాలెం గ్రామంలో కాటా సురేంద్ర ఏ గ్రేడ్ మోడల్, పులి ఆదిలక్ష్మి వేరుశనగ ఏ గ్రేడ్ మోడల్, వేమా రాఘవరెడ్డి ఏటీఎం మోడల్‌లో సాగుచేస్తున్న పంటలను పరిశీలించి ఆదాయ వ్యయాల గురించి అడిగి తెలుసుకున్నారు. పురిణి మల్లేశ్వరి ప్రకృతి వ్యవసాయ వనరుల కేంద్రాన్ని సందర్శించి కషాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఘన జీవామృతం, ద్రవజీవామృతం, బీజామృతం, వివిధ రకాల కషాయాలను డెమో చేసి చూపించారు. మండలంలో సాగుచేస్తున్న అన్ని రకాల పంటల గురించి, వాటికి ఉపయోగించే కషాయాల గురించి ప్రకృతి వ్యవసాయ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో రైతులు, గ్రామసిరి సిబ్బంది బసవయ్య, నాగేంద్రవర్మ, గీత, విజయలక్ష్మి, అనిల్‌కుమార్, నరసింహులు, కొట్టం, రెడ్డప్ప, దివాకర్ పాల్గొన్నారు.

కౌలు రైతు కార్డులు అందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ ఆదిలక్ష్మి, అగ్రికల్చర్ ఆఫీసర్ స్వర్ణలత

మద్దిపాడు: మండలంలోని కౌలు రైతులందరికీ కౌలు రైతు కార్డులు అందించాలని వీఆర్వోలను తహసీల్దార్ ఆదిలక్ష్మి ఆదేశించారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలు, అగ్రికల్చర్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో సుమారు 1300 మందికిపైగా కౌలు రైతులు ఉన్నారని, వారందరికీ కార్డులు ఇవ్వాల్సి ఉందని తెలిపారు. కౌలు రైతు కార్డు తీసుకుని ఉంటే పంట నష్టం జరిగినప్పుడు పరిహారం పొందడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. కౌలు రైతు కార్డు కేవలం 11 నెలల కాలపరిమితి కలిగి ఉంటుందన్నారు. అందువలన సాగుదారు హక్కు పత్రంపై సంతకం పెట్టడం వలన భూ యజమానికి హక్కులకు ఎటువంటి భంగం వాటిల్లదని తెలిపారు. ఈ పత్రం ద్వారా సాగుదారు బ్యాంకు నుంచి 1,60,000 వరకు ఎటువంటి పూచీకత్తు లేకుండా రుణం పొందవచ్చని, పంట రుణం బాధ్యత సాగుదారుపైనే ఉంటుందని తెలిపారు. వీఆర్వోలు, వీఏఏలు కౌలు రైతు కార్డులను త్వరితగతిన పంపిణీ చేయాలని మండల వ్యవసాయ శాఖ అధికారిణి స్వర్ణలత తెలిపారు.

రాజ్యాంగ హత్యా దినంపై అవగాహన కార్యక్రమం



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

ఒంగోలు సిటీ: స్థానిక వెంగముక్కలపాలెంలోని క్విస్ కాలేజ్ ఆఫ్ ఫార్మసీలో బుధవారం రాజ్యాంగ హత్యా దినంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ప్రెసిడెంట్ డాక్టర్ సూర్య కళ్యాణ్ చక్రవర్తి, ఎగ్జిక్యూటివ్ చైర్మన్ డాక్టర్ శ్రీ గాయత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా డీఆర్వో ఓబులేసు, స్టెప్ సీఈఓ శ్రీమన్నారాయణ పాల్గొని మాట్లాడారు. వారు మాట్లాడుతూ స్వేచ్ఛాయుత భారత దేశంలో మన పాలకులు తప్పు చేస్తే తూర్పారబట్టే స్వేచ్ఛ ఉందన్నారు. తప్పు చేయకపోయినా మనకు సదరు నాయకుడు ముఖం నచ్చకపోతే తిట్టే స్వేచ్ఛ ఇక్కడి ప్రజలకు మన భారత రాజ్యాంగం కల్పించిందన్నారు. ప్రజలకు రాజ్యాంగం కల్పించిన స్వేచ్ఛను ప్రజలకు దూరం చేసిన అర్ధ శతాబ్దం నాటి అత్యవసర పరిస్థితి ఓ చీకటి అధ్యాయమని అన్నారు. 1975లో భారత పౌరులపై అత్యవసర పరిస్థితి విధించడం అనేది ఓ పీడ కలన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో విశ్రాంత డిప్యూటీ తహసీల్దార్ ఎఱ్ఱాయేలు, కళాశాలల ప్రిన్సిపాల్ డా.కిషోర్‌బాబు, స్టెప్ అసిస్టెంట్ మేనేజర్ రాజా, పావని, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ధనమూర్తి, కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, ఫార్మసీ విద్యార్థులు పాల్గొన్నారు

పనుల్లో నాణ్యత పాటించాలి



కల్వర్టు పనులను పరిశీలిస్తున్న కమిషనర్

గిద్దలూరు రూరల్: పట్టణంలో అభివృద్ధి పనులను నగర పంచాయతీ కమిషనర్ ఈ.వి.రమణబాబు బుధవారం పరిశీలించారు. క్లబ్ రోడ్డులో నూతనంగా నిర్మిస్తున్న కల్వర్టును, ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో, నల్లబండ బజారులో సీసీ రోడ్ల నాణ్యతను తనిఖీ చేశారు. రాజానగర్ ముందు భాగంలో సిమెంట్ రోడ్డుపై నీరు నిలిచే ప్రాంతాన్ని పరిశీలించి డ్రైనేజీ నిర్మాణ పనులు త్వరలో ప్రారంభిస్తామని చెప్పారు. 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.కోటి, బీపీఎస్, ఎల్ఆర్ఎస్ కింద రూ.కోటి నిధులతో పనులు చేస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట పబ్లిక్ హెల్త్ డీఈ వి.శ్రీనివాసరావు, ఏఈ రవీంద్రయాదవ్, సిబ్బంది ఉన్నారు.

గ్రామాల్లో ఉపాధి పనులను వేగవంతం చేయండి



మాట్లాడుతున్న ఎంపీడీఓ సురేష్‌బాబు

సంతనూతలపాడు: గ్రామాల్లో ఉపాధి పనులను వేగవంతం చేయాలని ఎంపీడీవో డి.సురేష్‌బాబు ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మండల స్థాయిలో ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. టార్గెట్ ప్రకారం కూలీలందరూ పనులకు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని ఉపాధి సిబ్బందికి సూచించారు. ఫారం పాండ్స్ పనుల వేగవంతానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఇటీవల వర్షాలకు ఫారం పాండ్స్ పనులు ఆగినందున మళ్లీ ప్రారంభించాలన్నారు. అన్ని పంచాయతీలలో ఉపాధి పనులు ప్రారంభించి ఫీల్డ్‌లో కొలతల ప్రకారం కచ్చితంగా పని జరగాలన్నారు. ఉపాధి కూలీలకు కనీస వేతనం వచ్చేలా కొలతలు ఇవ్వాలని ఆదేశించారు. మండల ఏపీఓ వాసంతి, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రధాన పంటకు పచ్చిరొట్ట శ్రేయస్కరం



రైతులతో మాట్లాడుతున్న ఏఓ భాస్కర్

చీమకుర్తి రూరల్: పంటకు మోతాదుకు మించి ఎరువులు వాడటం అనర్థమని, పచ్చిరొట్ట శ్రేయస్కరమని మండల వ్యవసాయాధికారి డీవీ భాస్కర్ సూచించారు. బుధవారం మండలంలోని చినరావిపాడు, రాజుపాలెం, లక్ష్మీపురం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ పంటకు 16 రకాల పోషకాలు అవసరమవుతాయని, వీటిలో నత్రజని, పొటాషియం, భాస్వరం ఎక్కువ మోతాదులో అవసరమని తెలిపారు. సూక్ష్మ పోషకాలు కూడా పంటకు తక్కువ మోతాదులో అవసరమని, కానీ, రైతులు ఎక్కువ మోతాదులో వాడటం వలన అదనపు ఖర్చు అవుతుందని అన్నారు. ఎరువులను సమపాళ్లలో వాడాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ విస్తరణాధికారులు, గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

చీమకుర్తి మండలంలో సమస్యలపై డీపీఓ పర్యటన



గుండువారిలక్ష్మీపురంలో గ్రామస్తులతో మాట్లాడుతున్న డీపీఓ వెంకటనాయుడు

చీమకుర్తి రూరల్: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలు పరిష్కరించేందుకు కలెక్టర్ ఆదేశాల మేరకు డీపీఓ వెంకటనాయుడు బుధవారం మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించారు. మండలంలోని గుండువారిలక్ష్మీపురం, ఎర్రగుడిపాడు ప్రజలు గత సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సమస్యల పరిష్కారం కోసం అర్జీలు అందజేశారు. గుండువారిలక్ష్మీపురంలో చెరువు ఆక్రమణకు గురైందని స్థానికులు అర్జీ ఇవ్వగా, పరిష్కరించడానికి బుధవారం ఆ గ్రామంలో డీపీఓ పర్యటించారు. గ్రామస్తులను అడిగి వివరాలు తెలుసున్నారు. ఆయన వెంట ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ శాంతిప్రియ, కార్యదర్శులు పాల్గొన్నారు.

బెస్త సంఘ అధ్యక్షుడి ఏకపక్ష వైఖరిపై నిరసన

- న్యాయం చేయాలంటూ తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసిన 90 కుటుంబాలు



తహసీల్దార్ వి.కిరణ్‌కు వినతి పత్రం ఇస్తున్న బెస్త కుటుంబాలు

కంభం: బెస్త సంఘం అధ్యక్షుడిగా ఉన్న బొందలపాటి వెంకటేశ్వర్లు ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటున్నాడని, అతని సోదరుడు సంఘ సభ్యులపై దౌర్జన్యం చేస్తున్నాడంటూ ఆ సంఘ మాజీ అధ్యక్షుడు ఇల్లా సోమయ్య ఆధ్వర్యంలో బుధవారం కమ్యూనిటీ భవనం వద్ద నిరసన వ్యక్తం చేశారు. వివరాల్లోకి వెళ్తే.. గత కొంత కాలంగా బెస్త సంఘానికి చెందిన రెండు వర్గాల మధ్య వివాదం కొనసాగుతోంది. గతంలో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదులు చేసుకోగా గుడి, శ్మశాన వాటికకు సంబంధించిన సమస్యను పరిష్కరించారు. కాగా సంఘానికి చెందిన కమ్యూనిటీ హాల్లోకి తాము ప్రవేశించకుండా వెంకటేశ్వర్లు వర్గం తాళం వేసింది. దీనిపై ఇల్లా సోమయ్య వర్గానికి చెందిన సుమారు 90 కుటుంబాలు బెస్త కళ్యాణ మండపం ఎదుట బుధవారం నిరసనకు దిగారు. అనంతరం తహసీల్దార్ వి.కిరణ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సోమయ్య మాట్లాడుతూ.. గత నాలుగు నెలల నుంచి బెస్త సంఘం అధ్యక్షుడు తమను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. సంఘానికి చెందిన 120 కుటుంబాలు వినియోగించుకునేలా ప్రభుత్వం కమ్యూనిటీ హాల్ నిర్మించి ఇచ్చిందని, అదేదో తమ సొంతమైనట్లుగా వెంకటేశ్వర్లు వర్గం వ్యవహరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినా న్యాయం జరగలేదని, అందుకే తహసీల్దార్‌కు వినతి పత్రం ఇచ్చామని తెలిపారు. ఇరువర్గాల వారు టీడీపీకి చెందిన వారు కాగా బుధవారం జరిగిన నిరసన కార్యక్రమంలో మార్కాపురం బీజేపీ నాయకురాలు శాసనాల సరోజిని, మొత్రిబోయిన చిన్నయ్య, పలువురు కంభం బీజేపీ నాయకులు పాల్గొని మద్దతు తెలిపారు.

జూలై 9న మధ్యాహ్న భోజన కార్మికుల సమ్మె

గిద్దలూరు రూరల్: మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యల పరిష్కారం కోసం జూలై 9న సమ్మె నిర్వహించనున్నట్లు సీఐటీయూ నాయకుడు టి.ఆవులయ్య తెలిపారు. గిద్దలూరులోని ఎంఆర్‌సీ కార్యాలయంలో బుధవారం మధ్యాహ్న భోజన కార్మికులతో కలిసి సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులకు కనీస వేతనం అందజేయడం లేదన్నారు. లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, మెనూ చార్జీలు ఒక్కో విద్యార్థికి రూ.20 చొప్పున ఇవ్వాలని, ప్రమాదవశాత్తు మరణించిన కార్మికులకు రూ.20 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజనం పథకం కార్మికులు లక్ష్మీదేవి, నరసమ్మ, కుమారి తదితరులు పాల్గొన్నారు.

గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై విద్యార్థులకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఎస్సై అజయ్‌బాబు

సంతనూతలపాడు: సంతనూతలపాడు హైస్కూల్లో బుధవారం విద్యార్థులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక ఎస్సై వేజెండ్ల అజయ్‌బాబు పాల్గొని ఇటీవల చిన్నారులపై లైంగిక దాడులు పెరుగుతున్న నేపథ్యంలో వారికి గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. చాలా సందర్భాల్లో తెలిసిన వారి నుంచే పిల్లలు ఇలాంటి వేధింపులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రతిఒక్కరూ నేరాలపై అప్రమత్తంగా ఉండి జాగ్రత్తలు వహించాలని సూచించారు. ట్రాఫిక్ రూల్స్ గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో హైస్కూల్ ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.